క్లుప్తంగా

పొన్నూరు తహసీల్దార్ బాధ్యతలు స్వీకారం



పొన్నూరు: మండల తహసీల్దార్‌గా సూర్య నారాయణ సింగ్ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆయన పొన్నూరు తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బొద్దులూరి రంగారావు, పార్టీ నాయకులు గోపిశెట్టి వాసు, ములుకుదుటి రఘురామ విద్యాసాగర్‌లు తహసీల్దార్ సూర్యనారాయణ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు



పొన్నూరు: ఆర్టీసీ ప్రయాణికులకు సురక్షిత ప్రయాణం అందించడంతోపాటు, ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించేవిధంగా ప్రభుత్వం బహుమతులు కూడా అందజేస్తున్నట్లు పొన్నూరు డిపో మేనేజర్ అజిత కుమారి పేర్కొన్నారు. డిపో పరిధిలో బస్సులలో ప్రయాణించిన పలువురికి లక్కీడీప్ ద్వారా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ బస్సులో ప్రయాణం చేసి దిగే సమయంలో ప్రయాణికులు టికెట్ పై తమ సెల్‌ఫోన్ నెంబర్, పేరు రాసి బస్సులోని గిఫ్ట్ బాక్స్‌లో వేయాలని సూచించారు. ఆ టికెట్లను ప్రతినెల 1, 16 తేదీలలో డ్రా తీసి ప్రయాణికులకు బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

'కళ్లం' అధ్యాపకురాలికి డాక్టరేట్



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి అధ్యాపకుని లక్ష్య సాధనకు తమ కళాశాల ఎల్లప్పుడూ వెన్నంటే ఉంటుందని కళ్లం ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న కె.భాగ్యశ్వేతలతకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రదానం చేసిందన్నారు. ఫ్లూయిడ్ మెకానిక్స్ హీట్ ట్రాన్స్‌ఫర్ ఎన్‌హెన్స్‌మెంట్ అనాలసిస్ ఆన్ థర్మల్ రేడియేటివ్ ఫ్లో ఆఫ్ హైబ్రిడ్, టెర్నరీ నానో ఫ్లూయిడ్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించిందన్నారు. డాక్టరేట్ పొందిన అధ్యాపకురాలిని ఎన్‌యూ పీహెచ్‌డీ రీసెర్చ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.జ్ఞానేశ్వరరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, డాక్టర్ జి.శ్రీనివాసులు అభినందించారు.

ఘనంగా పోలేరమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం



గుంటూరు రూరల్: భక్తులు కోరిన కోరికలు తీర్చే దేవత పోలేరమ్మతల్లి అని వేదసీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసీ ధర్మచరణ్, రాష్ట్ర దేవదాయ శాఖ సలహాదారులు జ్వాలాపురం శ్రీకాంత్‌లు పేర్కొన్నారు. మంగళవారం గోరంట్ల గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మతల్లి దేవస్థానం 7వ వార్షికోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కనుల పండువగా జరిగింది. కార్యక్రమంలో అతిథులు పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తులసీ ధర్మచరణ్ మాట్లాడుతూ గోరంట్ల మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ పర్యవేక్షణలో ఈనెల 4వ తేదీన అమ్మవారికి పంచామృతాభిషేకంతో మొదలై, అష్టోత్తర శతనామావళి, కుంకుమార్చనతో ప్రత్యేక పూజ, అన్నదాన కార్యక్రమాలతో వేడుకలు ఘనంగా ముగిశాయని తెలిపారు. రాష్ట్ర దేవదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, తులసీ ధర్మచరణ్‌లు అమ్మవారి తీర్థ ప్రసాదం మహాన్నదానాన్ని ప్రారంభించారు. ట్రిపుల్ ఎక్స్ సోప్స్ అధినేత అరుణాచలం మాణిక్యవేల్, కంచర్ల ఆంజనేయులు, యర్రంశెట్టి సూరి, డాక్టర్ కంఠా జగదీష్, తాళ్ళ నాగరాజు, వేద సీడ్స్ జీఎం తోట రంగారావు, డీజీఎం దావులూరు నాగబాబు, తేలప్రోలు వెంకట్రావు, గాజుల సాయిరాం, పలు పార్టీల నాయకులు, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అధిక దిగుబడుల ప్రయోగం

నాడు చంద్రబాబు ప్రభుత్వంలో.. కొనుగోలు చేసిన విత్తనాలు నాణ్యమైనవా? నకిలీవా తెలుసుకోవాలంటే ఏం చేయాలో తెలియని పరిస్థితి. పురుగు మందులు నకిలీవో కావో తెలుసుకోవాలంటే ఎక్కడికి వెళ్లాలో తెలియని దుస్థితి. వ్యాపారి అమ్మినవి తీసుకుని గుడ్డిగా పొలంలో ప్రయోగించడం. అంతా అనుకూలిస్తే సరి. లేదంటే నకిలీల బారిన పడి దిగుబడులు రాక అప్పుల ఊబిలో చిక్కుకుపోవడం. పట్టించుకోవాల్సిన అప్పటి చంద్రబాబు సర్కారు రైతులను చిన్నచూపు చూడటం కనిపించేవి.

నేడు పరిస్థితులు పూర్తిగా మారాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతుకు మంచిరోజులొచ్చాయి. వ్యవసాయాన్ని పండగలా మారుస్తున్నారు. రైతు భరోసా పథకం మొదలు నియోజకవర్గ కేంద్రాల్లో అగ్రిల్యాబ్‌ల ఏర్పాటు వరకు ఎన్నో విప్లవాత్మక మార్పులు. మన నియోజకవర్గంలోనే మనం కొనుగోలు చేసిన విత్తనాలను పరీక్షించుకునే బృహత్తర ప్ర'యోగం'. మొలకశాతం మొదలు ప్యూరిటీ వరకు ప్రయోగశాలలోనే పరీక్షించుకునేందుకు చక్కటి అవకాశం. 'వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్'లు రైతాంగానికి సదా మీసేవలో.. అంటూ సిద్ధంగా ఉన్నాయి.

సదా రైతుల సేవలో 'అగ్రిల్యాబ్'

- ప్రత్తిపాడులో రూ.62 లక్షలతో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- అత్యాధునిక పరికరాలతో ఇక్కడే విత్తనాలు, ఎరువుల నాణ్యతా పరీక్షలు
- రైతాంగానికి పూర్తి ఉచితంగా ప్రయోగశాల సేవలు
- త్వరలో భూసార పరీక్షలు కూడా..



ప్రత్తిపాడులో రూ. 60 లక్షలతో అధునాతనంగా నిర్మించిన వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్



ప్రత్తిపాడు: నిత్యం స్వేదాన్ని చిందించే రైతులకు, దేశం ఆకలి తీర్చే అన్నదాతలకు నాణ్యమైన ఇన్‌పుట్స్ అందించడమే లక్ష్యంగా నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను రూ. 62 లక్షల నాబార్డు నిధులతో నిర్మించారు. ఇందులో వ్యవసాయ, పశుసంవర్థక శాఖలకు సంబంధించిన రెండు ప్రయోగశాలలున్నాయి. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండలాల రైతులకు ప్రయోగశాల సేవలు అందుతున్నాయి. ల్యాబ్‌లో ఏఓ, ఏఈఓ, సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. వీరు త్వరితగతిన పరీక్షలు చేసి రైతులకు ఫలితాలు తెలియజేస్తారు.

ఏమేమి పరీక్షలు.. ఎలా సేకరిస్తారంటే..

ఈ ప్రయోగశాల ద్వారా అత్యాధునిక పరికరాలు, అధునాతన ల్యాబొరేటరీలతో విత్తనాల మొలకశాతం నిర్ధారణ పరీక్షలతో పాటు, విత్తన నాణ్యత నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. అదేవిధంగా ఎరువులకు సంబంధించి పోషక విలువల వాల్యూలను నిర్ధారిస్తారు. ఇందులో నాలుగు రకాల శాంపిల్స్‌ను సేకరిస్తారు. ఒకటి యాక్ట్ శాంపిల్స్ (కోడింగ్ సెంటర్లు నుంచి వచ్చేవి), రెండు ఆర్‌బీకేల నుంచి వచ్చేవి, మూడు రైతుల నుంచి నేరుగా వచ్చేవి పై మూడు శాంపిల్స్‌ను పూర్తి ఉచితంగా పరీక్షిస్తారు. నాల్గవది ట్రేడ్ శాంపిల్స్ (వ్యాపారస్తులు నిర్ణీత రుసుం చెల్లించి పరీక్షలు చేయించుకునేవి). వరి, మిర్చి, మినుము, సోయాబీన్.. ఇలా అన్ని రకాల విత్తనాల నాణ్యతను ఇక్కడ పరీక్షిస్తారు. ఇవికాక త్వరలోనే భూసార పరీక్షలను కూడా ఇక్కడే నిర్వహించనున్నారు.

2021లో ల్యాబ్ ప్రారంభమైన నాటి నుంచి నేటివరకు ప్రయోగశాలలో పరీక్షించిన శాంపిల్స్ వివరాలు ఇలా ఉన్నాయి..

ఫెర్టిలైజర్ పరీక్షల వివరాలు..

2021-22:	29
2022-23:	101
2023-24:	93
మొత్తం:	223

విత్తన పరీక్షల వివరాలు..

2021-22:	43
2022-23:	144
2023-24:	451
మొత్తం:	638



ప్రయోగశాలలో మొలకశాతం పరీక్షలు చేస్తున్న ఏఓ, ఏఈఓలు



విత్తనాల నాణ్యతను పరీక్షించేందుకు వినియోగించే ఆధునిక పరికరాలు

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఎరువులు, విత్తనాల నాణ్యతను పరీక్షించుకోవాలనుకునే రైతులు నేరుగా ల్యాబ్‌కు రావచ్చు. ఇక్కడే ఈ ప్రయోగశాల నుంచే పరీక్షించి ఫలితాలు సాధ్యమైనంత త్వరగా ఇస్తాం. కల్తీలేని ఉత్పత్తులను వినియోగించడం వలన దిగుబడులు పెరిగి రైతుకు వ్యవసాయం లాభసాటిగా చేయడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం. అందుకోసమే నియోజకవర్గ కేంద్రాల్లో వ్యవసాయ ప్రయోగశాలలను ఏర్పాటుచేశారు. రైతులు ల్యాబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– పి.శివరామలక్ష్మి, ఏఓ (వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్)

చేబ్రోలు ఎస్ఐగా మహేష్ కుమార్

వీఆర్‌కు ప్రస్తుత ఎస్ఐ గిరిబాబు



పి.మహేష్ కుమార్

చేబ్రోలు: చేబ్రోలు సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పి.మహేష్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా జరిగిన బదిలీలలో ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న కె.ఆనంద్‌ను స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో గిరిబాబు బాధ్యతలు స్వీకరించారు. అయితే కొద్ది రోజులకే వీఆర్‌కు పంపుతూ ఎస్పీ ఆదేశాలు ఇచ్చారు. రెండు రోజుల క్రితం చేబ్రోలులో రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు సమయంలో పోలీసుల దురుసు ప్రవర్తన, నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ సోమవారం దళిత సంఘాలు, మృతుడి కుటుంబసభ్యులు పోలీసు స్టేషన్ ముందు మృతదేహంతో సుమారు మూడు గంటల పాటు రాస్తారోకో చేశారు. ఈ ఘటన నేపథ్యంలో గిరిబాబును వీఆర్‌కు పంపినట్లు తెలిసింది. ప్రకాశం జిల్లాలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న 2020 బ్యాచ్‌కు చెందిన పి.మహేష్ కుమార్‌ను చేబ్రోలు ఎస్‌హెచ్‌ఓగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మంగళవారం ఎస్ఐగా మహేష్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన మహేష్‌కుమార్‌కు పోలీసులు సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేడు శివాలయంలో వేదపారాయణ ఉద్యోగానికి ఇంటర్వ్యూలు

పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో వేదపారాయణ ఉద్యోగానికి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేశారు. పెదకాకాని శివాలయంలో ప్రస్తుతం ముగ్గురు వేదపారాయణదారులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో పనిచేసిన అద్దేపల్లి వ్యాసనారాయణ అవధాని మృతి చెందడంతో శ్రీకృష్ణ యజుర్వేదం పోస్టు గత కొంతకాలంగా ఖాళీగానే ఉంది. ఈ పోస్టుకు 55 మంది దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం శివాలయంలో దేవదాయశాఖ అధికారులు, ధర్మకర్తల మండలి సమక్షంలో ఆగమ పండితులు శ్రీకృష్ణ యజుర్వేదం ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. అయితే ఈ పోస్టు ఇప్పటికే ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి బంధువులకు ఇచ్చేవిధంగా ఒప్పందం కుదిరినట్లు, రూ.లక్షల్లో నగదు చేతులు మారినట్లు గ్రామంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సీఎం జగన్ స్ఫూర్తితోనే సేవా కార్యక్రమాలు



విజయవాడ మెడ్‌స్టార్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటున్న నంబూరు గ్రామస్తులతో బజరంగ్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- మెడ్‌స్టార్‌లో యాంజియోగ్రామ్ చేయించుకున్న నంబూరు గ్రామస్తులకు పరామర్శ
- అందరికీ అత్యాధునిక వైద్యం అందజేస్తామని హామీ
- హర్షం వ్యక్తం చేస్తున్న రోగులు, బంధువులు

పెదకాకాని: మండలంలోని నంబూరు గ్రామంలో ఈనెల 4, 5వ తేదీలలో బజరంగ్ సంక్షేమ సంగమం కార్యక్రమం ద్వారా మీగుండె పదిలం శిబిరంలో గుండె సంబంధిత వైద్య శిబిరంలో యాంజియోగ్రామ్ పరీక్ష అవసరమైన 45 మందిని గుర్తించారు. వారిలో మొదటి విడతగా 17 మందిని చికిత్స నిమిత్తం మంగళవారం ప్రత్యేక బస్సులో విజయవాడ మెడ్‌స్టార్ ఆసుపత్రికి తరలించారు. యాంజియోగ్రామ్‌కు వచ్చిన రోగులను బజరంగ్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ పరామర్శించారు. ఈ సందర్భంగా బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ అత్యాధునిక వైద్య పరికరాలతో నిర్వహించిన యాంజియోగ్రామ్ పరీక్షలో 16 మంది ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉండగా ఒకరికి బైపాస్ సర్జరీ అవసరమున్నట్లు వైద్యులు గుర్తించడం జరిగిందన్నారు. బాధితులకు ఆరోగ్యశ్రీ పథకం వర్తింపజేస్తూ వేగవంతంగా సకాలంలో వైద్య సహాయం అందేందుకు తోడ్పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని మరిన్ని గ్రామాలకు తీసుకువెళతానన్నారు. బజరంగ్ బృందం నంబూరు గ్రామం నుంచి ప్రత్యేక బస్సు ద్వారా రోగులను ఆసుపత్రికి చేర్చడంపై రోగులు, కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

10న రాజశ్యామల మహాయజ్ఞం

గుంటూరు రూరల్: లోక కళ్యాణార్థం ఈనెల 10వ తేదీన రాజశ్యామల మహాయజ్ఞనం హైదరాబాద్ గచ్చిబౌలికి చెందిన భవతరిణి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించటం జరుగుతుందని మహాయజ్ఞం నిర్వహణ కమిటీ సభ్యుడు లంకా దాసరి ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఏటుకూరు సమీపంలోని కామేశ్వరరావు గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన యజ్ఞం బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శనివారం ఏటుకూరు ఆంజనేయస్వామి ఆలయం సమీపంలోని కామేశ్వరరావు గ్రౌండ్‌లో ఉదయం 4 గంటలనుంచి యజ్ఞం ప్రారంభమై, రాత్రి 9 గంటలకు ముగుస్తుందన్నారు. ఈ మహాయజ్ఞం కార్యక్రమంలో భద్రకాళీ పీఠాధీశ్వరి సింధూ మాతాజీ ముఖ్య అతిథిగా పాల్గొని మహదాశీర్వచనం చేస్తారని తెలిపారు. ఉదయం నుంచి గోపూజ, సుప్రభాత సేవ, వేదోపనిషత్ పారాయణ, గణపతిపూజ, శ్రీ చక్రార్చన, లలితా సహస్రనామా లక్ష కుంకుమార్చన, కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. నిర్వహణ కమిటీ సభ్యులు మాజేటి గోపాలకృష్ణ, బండారు సాంబశివరావు, ఎం.గౌరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కాకుమానువారితోటలో నివాసం ఉండే ఎం.మహేష్(38) అప్పుల బాధతో మంగళవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు.

కబ్జాకోరల నుంచి భూములు విడిపించండి

- రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములు ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి
- పేదలకు ఆ స్థలాలు కేటాయించాలి
- సీఆర్ నగర్ కాలనీ వాసుల ఆందోళన



దేవానాయక్ ఆక్రమించిన స్థలాల వద్ద నిరసన తెలుపుతున్న సీఆర్ కాలనీవాసులు

గుంటూరు రూరల్: ఎంతో విలువైన ప్రభుత్వ భూములను కమ్యూనిస్టు పార్టీ పేరుతో ఓ వ్యక్తి కబ్జా చేసి వాటినే అమాయక పేదలకు విక్రయిస్తూ రూ.కోట్లలో ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతున్నాడని చౌడవరం గ్రామం చంద్రరాజేశ్వరరావు కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం కాలనీలో స్థానికంగా ఉండే కమ్యూనిస్టు పార్టీ నాయకుడు దేవానాయక్ ప్రభుత్వ స్థలాలను కబ్జా చేయటంతోపాటు, స్థానికంగా నివశించే పేదల స్థలాలను సైతం ఆక్రమించి మళ్లీ వారికే విక్రయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆందోళన నిర్వహించారు. సుమారు 15 ఏళ్ల క్రితం కమ్యూనిస్టు పార్టీ నాయకులు వందలాది మంది పేదలకు ప్లాట్లను అందజేశారని తెలిపారు. అయితే నేడు ఆ స్థలాలను కమ్యునిస్టు పార్టీ నాయకుడిని అని చెప్పుకునే దేవానాయక్, అతని అనుచరులు ఎవరూ లేని అభాగ్యుల స్థలాలను కబ్జా చేసి మళ్లీ వారికే రూ.లక్షలకు అమ్ముతున్నారని ఆరోపించారు. కాలనీలో సుమారు 3వేల నుంచి 5 వేల కుటుంబాలు నివశిస్తూ ఉండగా కేవలం దేవానాయక్ ఆధీనంలోనే 60-70 ప్లాట్లు, దుకాణాలు, స్థలాలు, ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీ సమీపంలోని ఏళ్ల తరబడి ఉన్న వాగును సైతం కబ్జా చేసి అందులో వాటర్ ప్లాంట్ నిర్మించారని తెలిపారు. వర్షాకాలంలో వాగులో ప్రవహించాల్సిన నీరు కాలనీలో ఇళ్లపైకి వచ్చి ఇళ్లు మునిగి బయటకు వచ్చే పరిస్థితికూడా లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈవిధంగా రెవెన్యూ అధికారులను సైతం లెక్క చేయకుండా ప్రభుత్వ భూములను కబ్జాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని వాపోయారు. దేవానాయక్ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను, స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని స్థలాలు లేని అభాగ్యులకు అందజేయాలని కోరారు. ఆందోళన కార్యక్రమంలో కాలనీలోని మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ లక్ష్యం

- పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దివ్యమేఘన
- ప్రత్తిపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం



ప్రత్తిపాడు ఆరోగ్య సురక్ష శిబిరంలో బీపీ పరీక్షలు చేయించుకుంటున్న వృద్ధులు



పొన్నూరు వైద్యశిబిరంలో మాట్లాడుతున్న వ్యవసాయ సలహామండలి సభ్యుడు రంగారావు

ప్రత్తిపాడు: ప్రజలందరి సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం సచివాలయాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తుందని ప్రత్తిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దివ్యమేఘన అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి 305 మంది రోగులు వచ్చారు. వీరికి వైద్యాధికారులు డాక్టర్ దివ్యమేఘన, గైనకాలజీ స్పెషలిస్టు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ మౌనిక వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మాత్రలను అందజేశారు. ఆప్తాలమిక్ అసిస్టెంట్ రాములు దృష్టి సామర్థ్య పరీక్షలు జరిపారు. శిబిరాన్ని తొలుత ప్రత్తిపాడు ఉపసర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ బాపతు వెంకటరమణ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఉడుతూరి ఓంప్రకాష్‌రెడ్డిలు ప్రారంభించారు. కార్యక్రమంలో సెక్రటరీ జాన్‌పీరా, సీహెచ్ఓ స్వర్ణలత, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరు: ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేసి ఇంటింటికి వైద్యసేవలు అందిస్తుందని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని సాంబశివనగర్ ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు వ్యవసాయ సలహామండలి సభ్యుడు బి.రంగారావు అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ప్రజలకు వరం లాంటిదని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని వైద్యసేవలు ఉచితంగా పొందాలన్నారు. మార్కెట్‌యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, గోపిశెట్టి శ్రీనివాసరావు, డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, టి.వి.రావు, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన ఉండాలి

ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ కెనడీ

కాకుమాను: ప్రతి విద్యార్థి ఏ గ్రేడులో ఉండేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండల కేంద్రం కాకుమాను అంబేడ్కర్ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా కెనడీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయిలో ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు ద్వారా అనేక కోట్ల రూపాయలను ఖర్చుచేసి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు కల్పించినట్లు ఆయన తెలిపారు. వసతులతో పాటు విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మక విద్యను అందించి ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన తెలిపారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులు రాణించే విధంగా ఉపాధ్యాయులు బోధన అందించాలని ఆయన సూచించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. హెచ్ఎం రాజ్యలక్ష్మి, ఉపాధ్యాయిని జోత్స్న కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



సైడ్ కాలువల నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న షేక్ అసదుల్లా

గార్లపాడు(కాకుమాను): గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గార్లపాడులో మంగళవారం మండల పరిషత్ నిధులు రూ.8 లక్షల వ్యయంతో గ్రామంలో పలు వీధులలో సైడ్ కాలువల నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతు గత నాలుగున్నర సంవత్సరాల నుంచి మండలంలోని గ్రామాలలో మండల పరిషత్ నిధులు, ప్రభుత్వ నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో గ్రామాలలో ప్రజలకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి ముజావర్ షేక్ అసదుల్లా మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు ఆయా పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటివద్దకే అందించిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన తెలిపారు. ఈసందర్భంగా సైడ్ కాలువ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. జడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, వైస్ సర్పంచ్ కొమ్మాలపాటి రవికుమార్, నిడుబ్రోలు సుబ్బారావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారి టోకరా..

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

పెదకాకాని: వడ్డీ వ్యాపారం చేస్తున్న మహిళ పరారీ కావడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించిన సంఘటన వాసవీనగర్‌లో చోటు చేసుకుంది. పెదకాకాని మండలంలోని వాసవీనగర్ ప్రాంతానికి చెందిన పొన్నమూడి రజని గత కొంతకాలంగా వడ్డీ వ్యాపారం చేస్తుంది. ఇతరుల వద్ద నుంచి తక్కువ వడ్డీకి డబ్బులు తీసుకుని అధిక వడ్డీలకు ఇస్తూ వడ్డీ వ్యాపారం చేస్తుంది. నెల నెల వడ్డీలు ఇస్తూ వస్తున్న రజని గత కొద్దిరోజులుగా కనిపించకపోవడంతో బాధితులకు అనుమానం వచ్చి మంగళవారం పోలీసులను ఆశ్రయించారు. సుమారు రూ.4 కోట్ల వరకు స్థానికుల వద్ద నుంచి వడ్డీకి తీసుకున్నట్లు బాధితులు ఫిర్యాదు చేశారు.

జగనన్న గోరుముద్ద పరిశీలన

ప్రత్తిపాడు: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ప్రభుత్వం అందిస్తుందని ప్రత్తిపాడు ఉపసర్పంచ్ బాపతు వెంకటేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న గోరుముద్ద పథకం అమలు తీరుతో పాటు పోషకాహారంగా విద్యార్థులకు అందిస్తున్న రాగిజావ నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు రాగిజావను అందించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఉడుతూరి ఓంప్రకాష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి జాన్‌పీరా తదితరులున్నారు.

చిన్నారులకు ఆటల పోటీలు

నగరంపాలెం: జిల్లాలోని బాల బాలికలు కలిసికట్టుగా ఆట, పాటలతో ఆనందంగా గడపడమే బాలమేళా ముఖ్య ఉద్దేశమని చైల్డ్‌రైట్స్ అడ్వకేసి ఫౌండేషన్- క్రాఫ్ సమన్వయకర్త ఎ.వెంకట్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో కేవీపీ కాలనీలోని కేఎస్ఆర్‌టీ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బాలమేళా పేరుతో ఆటల పోటీలు మంగళవారం నిర్వహించారు.